క్లుప్తంగా

10వ తేదీ డిగ్రీ అడ్మిషన్లకు ఆఖరి గడువు

పాకాల: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు పొందేందుకు ఈ నెల 10వ తేదీ ఆఖరి గడువని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మొహిద్దీన్‌బాషా తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులకు ఇంటర్ పాసై ఆసక్తి ఉన్న విద్యార్థులు కళాశాలలో సంప్రదించి ఉచితంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 94915 20740, 93931 17566కు ఫోన్ చేయవచ్చని తెలిపారు.

టీటీడీ పరిపాలనా భవనం ఎదుట ధర్నా



టీటీడీ ఏడీ బిల్డింగ్ ఎదుట ధర్నా

తిరుపతి(అలిపిరి): వీఐపీ బ్రేక్ దర్శనాల లిస్టును ప్రతిరోజూ ప్రకటించాలని, ప్రతి మంగళవారం స్థానికులకు శ్రీవారి దర్శనాలు కల్పించాలని కోరుతూ తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనం ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేపట్టారు. మాజీ కేంద్ర మంత్రి చింతా మోహన్ మాట్లాడుతూ నిరుపేదలు, ప్రభుత్వ ఉద్యోగులు, జర్నలిస్టులకు తిరుపతి జూపార్కు సమీపంలో ఇంటి స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు సత్కారం



విద్యార్థులను సత్కరిస్తున్న హైస్కూల్ కమిటీ

తిరుపతి మంగళం: తిరుపతి 45వ డివిజన్ శివజ్యోతినగర్ తంబువానిగుంట మున్సిపల్ స్కూల్లో పదో తరగతి 600మార్కులకు 500 పైగా సాధించిన విద్యార్థులను హైస్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ కదిరి రాజేంద్ర ఆధ్వర్యంలో దుశ్శాలువాలతో సత్కరించి, సన్మానించారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసిందని ఆయన తెలిపారు. దీంతో మున్సిపల్ పాఠశాలల విద్యార్థినీవిద్యార్థులు 500 నుంచి 590వరకు మార్కులు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో ఆ స్కూల్ ప్రధానోపాధ్యాయిని ఎం.సుజాత, రఘునాథ్, స్థానిక నాయకులు గుప్తా, రాధాకృష్ణ, మునిరత్నం, అక్కినపల్లి లక్ష్మయ్య, సుజాత, జగన్నాథం, కృష్ణమూర్తి, చంద్ర, కరాటి రత్నాకర్ పాల్గొన్నారు.


పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

తిరుపతి సిటీ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని కామర్స్ అండ్ కంప్యూటర్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ నరసయ్య పేర్కొన్నారు. శనివారం ఎస్వీయూ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వర్సిటీ ఆవరణలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతి వ్యక్తి తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిశుభ్రత విషయంలో యువత అవగాహన పెంచుకుని సామాజిక బాధ్యతగా స్వీకరించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు కళాశాల పరిసర ప్రాంతాలను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రొఫెసర్ జీవీ రమేష్ బాబు, విభాగాధిపతి జి.అంజన్‌బాబు, అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

సంస్కృత బాలకేంద్ర ప్రారంభం

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో బాలబాలికలకు ఉచితంగా సంస్కృత భాష నేర్పేందుకు బాల కేంద్రాన్ని శనివారం వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య దశలో సంస్కృత భాష పిల్లలకు నేర్పించడం ఎంతో అవసరమన్నారు. తిరుపతి నగరంలో పలు ప్రాంతాలలో సుమారు 50 బాల సంస్కృత కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు వర్సిటీ సిద్ధంగా ఉందని తెలిపారు. సంస్కృత భారతి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ నందన్‌భట్, సంయోజకులు సమీర్ సాహ, విద్యా సుధ, ప్రీతి సురేష్, సుబ్రమణ్యం, మణికంఠ, బాలబాలికలు పాల్గొన్నారు.

నెహ్రూపై విమర్శలు విడ్డూరం



తిరుపతి కల్చరల్: నెహ్రూ అంబేడ్కర్ రాజకీయ భవిష్యత్తు నాశనం చేశాడని ప్రధాని మోదీ విమర్శలు చేయడం విడ్డూరమని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ ధ్వజమెత్తారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొన్న లోక్‌సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ నెహ్రూపై చేసిన విమర్శలు ఆయన చరిత్ర రాహిత్యానికి నిదర్శనమన్నారు. నెహ్రూ, అంబేడ్కర్ మధ్య మంచి సత్సంబంధాలు ఉండేవన్నారు. తిరుపతిలో క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, ప్రస్తుత ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టాలని కోరారు. కాంగ్రెస్ నేతలు యార్లపల్లి గోపి, శాంతియాదవ్ పాల్గొన్నారు.

భక్త జనసంద్రం





అలిపిరి లగేజీ కేంద్రం వద్ద క్యూలైన్లలో పడిగాపులు కాస్తున్న భక్తులు, లగేజీలతో భక్తులు



క్యూలో వేచి ఉన్న భక్తులు



క్యూలైన్లలో గేట్లు ఎక్కుతున్న భక్తులు

తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో కాలినడకన వెళుతున్నారు. ఈ క్రమంలో తిరుపతిలోని అలిపిరి మెట్ల మార్గం వద్ద ఉన్న కౌంటర్లలో లగేజీని డిపాజిట్ చేయడానికి పెద్ద ఎత్తున రావడంతో రద్దీ నెలకొంది. క్యూలైన్లల్లో లగేజీలతో భక్తులు పడిగాపులు కాశారు. సిబ్బంది కౌంటర్లు తెరవడంతో ఒక్క సారిగా కేంద్రంలోకి ఎగబడ్డారు. గేట్లను సైతం లెక్క చేయకుండా దూసుకెళ్లారు. మరోవైపు కాలి నడక దారిలో భక్తులు మొదటి మెట్టు వద్ద కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకుని తిరుమలకు పయనమయ్యారు. -సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య



విద్యా సామగ్రి అందజేస్తున్న ఎంఈఓ

భాకరాపేట: ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య బోధిస్తున్నట్లు ఎర్రావారిపాళెం మండల విద్యాశాఖాధికారి సతీష్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని తొగటపల్లె ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు చెంగల్‌రాయుడు విద్యార్థులకు విద్యా సామగ్రిని తన సొంత నిధులతో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మాట్లాడుతూ చెంగల్‌రాయుడు ఏ పాఠశాలలో పని చేసినా విద్యార్థులందరికీ విద్యా సామగ్రిని అందిస్తారన్నారు. ఆయన సేవలకు గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డును ప్రదానం చేసిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణ, విద్యార్థుల తల్లిదండ్రులు నాగభూషణం, వెంకట్రామయ్య, కృష్ణమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధుడి శరీరంలో కణితి తొలగింపు



మీడియాతో మాట్లాడుతున్న వైద్యుల బృందం

తిరుపతి తుడా: ఆస్టర్ నారాయణాద్రి ఆసుపత్రిలో 62 ఏళ్ల వృద్ధుడి శరీరంలో నుంచి కణితిని విజయవంతంగా తొలగించారు. ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ విజయ్‌కుమార్ రెడ్డి నేతృతంలో వైద్యుల బృందం శస్త్రచికిత్సలో పాల్గొన్నారు. 28x15 సెంటీమీటర్ల కణితిని తొలగించినట్లు డాక్టర్ విజయకుమార్ రెడ్డి తెలిపారు. ఆరోగ్యంగా కోలుకున్నారని ఆయన తెలిపారు. ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ సీఓఓ డాక్టర్ శ్రీధర్ ముని, ఇతర వైద్యులు పాల్గొన్నారు.



కలెక్టర్‌తో వయోవృద్ధుల సంక్షేమశాఖ అధికారి శ్రీనివాస్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, మేయర్ డాక్టర్ శిరీష

కలెక్టర్‌ను కలిసిన మేయర్

తిరుపతి అర్బన్: నూతన కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాద పూర్వకంగా తిరుపతి కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష శనివారం కలెక్టరేట్‌లో కలిశారు.ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, ఏఎస్పీ వెంకట్రావు, సెబ్ అదనపు ఎస్పీ రాజేంద్ర, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాస్, మాజీ ఎంపీ చింతా మోహన్ తదితరులు కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

స్వచ్ఛతకు తొలి ప్రాధాన్యం

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో స్వచ్ఛతకు తొలి ప్రాధాన్యమిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో ఆయన శనివారం తొలి సమావేశాన్ని నిర్వహించారు. కమిషనర్ అదితిసింగ్‌తోపాటు అన్ని విభాగాల అధిపతులు, ఆయా శాఖల పరిధిని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే సమీక్షలో కమిషన్ అదితి సింగ్ కొంతసేపు ఉండి ఆ తర్వాత కలెక్టరేట్‌కు వెళ్లిపోయారు. సమీక్ష అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. అధికారులు ఎవరి విధులను వారు సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించినట్లు తెలిపారు. తిరుపతి నగరంలో రోడ్లపై గుంతలు లేకుండా వేగంగా ప్యాచ్‌వర్కులు చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. తిరుపతి నగరంలో యూడీఎస్ ఓవర్ ఫ్లో సమస్య తీవ్రంగా ఉండడాన్ని గుర్తించామన్నారు. దీని నివారణకు ఇంజినీర్లు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ బడ్జెట్‌కు అనుగుణంగానే పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న టీడీఆర్ బాండ్లను పరిశీలించి స్థల యజమానులకు అందజేస్తామని ఆయన చెప్పారు. 20 రోజుల్లో ప్రతి విభాగానికి సంబంధించి డీటెయిల్ రిపోర్టు ఇవ్వాలని ఆదేశించినట్లు ఆయన తెలిపారు. అక్కడ నుంచి స్విమ్స్, రుయాలో పర్యటించి అక్కడ రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అదనపు కమిషనర్ చరణ్ తేజ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్ఈ మోహన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకటరామిరెడ్డి , డీసీపీ శ్రీనివాసులు రెడ్డి, ఏసీపీ బాలసుబ్రమణ్యం, రెవెన్యూ ఆఫీసర్లు కేవీఎల్ వర్మ, సేతు మాధవ్, మేనేజర్ చిట్టిబాబు ఇతర అధికారులు పాల్గొన్నారు.

నకిలీ పత్రాలతో భూకబ్జాకు యత్నం

- అడ్డుకున్నందుకు తమపై రాజకీయం పేరుతో దౌర్జన్యం
- అవిలాల లోకనాథరెడ్డి



మాట్లాడుతున్న అవిలాల లోకనాథరెడ్డి

తిరుపతి కల్చరల్: వేదాంతపురం గ్రామ పంచాయతీలోని సర్వే నెంబర్లు 216, 221/1, 221/2, 219/10లోని 1.97 ఎకరాల భూమికి సంబంధించి నకిలీ పత్రాలు సృష్టించి కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, అక్రమ కట్టడాల నిర్మాణాన్ని అడ్డుకున్నందుకు తమపై రాజకీయ రంగు పూసి దౌర్జన్యం చేస్తున్నారని అవిలాలకు చెందిన లోకనాథరెడ్డి తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. సదరు భూమిని తాము ఎప్పుడూ ఎవరికీ విక్రయించ లేదన్నారు. అయితే ఈ భూమిని ఎలాగైనా దక్కించుకోవాలని కృష్ణమూర్తి, మమత, బిల్డర్ శ్రీనివాసులు నకిలీ పత్రాలు సృష్టించి కాజేసేందుకు కుట్ర పన్నారన్నారు. దీన్ని తాము అడ్డుకోవడంతో వారు ఇప్పటికే మూడు సార్లు కోర్టులో కేసు వేశారని తెలిపారు. అయినా న్యాయ స్థానం సదరు భూమి తమకే చెందుతుందని తీర్పు ఇవ్వడం జరిగిందని తెలిపారు. అయినా వారు ఎలాగైనా తమ భూమిని దక్కించుకోవాలనే ఉద్దేశంతో మళ్లీ హైకోర్టులో దావా వేశారని తెలిపారు. హైకోర్టు మాకు ఇంజక్షన్ ఆర్డర్ జారీ చేసిందన్నారు. కోర్టు ఇచ్చిన ఇంజక్షన్ ఆర్డర్‌ను గౌరవించి తాము భూమిలోకి ప్రవేశించలేదన్నారు. అయితే గత వారం రోజుల నుంచి కోర్టు ఉత్తర్వులు ఇచ్చినా భూమిలో దౌర్జన్యంగా వారు నిర్మాణ పనులు జరుపుతుండడంతో తాము అడ్డుకున్నామన్నారు. అయితే తమ భూమి సమస్యలకు వారు రాజకీయ రంగరు జోడించి వివాదాస్పదం చేయడం దారుణమన్నారు. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించి దౌర్జన్యంగా నిర్మాణాలు చేస్తున్న వారిపై కోర్టు ధిక్కార పిటిషన్ వేయనున్నట్లు తెలిపారు. తమ భూమిలో ఆక్రమణదారులు చేపడుతున్న నిర్మాణాలను అడ్డుకుంటే దౌర్జన్యం చేసి, చంపేస్తామని బెదిరిస్తున్నారని వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి తమ భూమిని కాపాడడంతో పాటు తమ రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో చంద్రశేఖర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, పద్మనాభరెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డులకు సత్కారం



హోంగార్డు మోహన్ కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి క్రైమ్: జిల్లాలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డులను జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఘనంగా సత్కరించారు. హోంగార్డులు రాధాకృష్ణ, గోపాల్ రెడ్డి సుదీర్ఘ కాలంగా పోలీస్ శాఖకు సేవలందిస్తూ పదవీ విరమణ పొందారు. వీరికి ఒక్కొక్కరికి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు 5 లక్షల రూపాయలు చెక్కులను ఇచ్చి ఘనంగా సత్కరించారు. అదేవిధంగా టీటీడీ విజిలెన్స్‌లో సుదీర్ఘ కాలం పాటువిధులు నిర్వహించిన హోంగార్డు మోహన్ గత మే నెలలో అనారోగ్యంతో మృతి చెందాడు. వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయంగా ఆయన భార్య కవితకు ఐదు లక్షల రూపాయల చెక్కును ఎస్పీ అందజేశారు.


శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు



ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్

తిరుమల: శ్రీవారిని శనివారం తెలంగాణ ఎంపీ రఘునందనరావు, ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్, ఏపీ, తెలంగాణ ఇన్‌కం టాక్స్ చీఫ్ కమిషనర్ మధుస్మిత, ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే వాసుబాబు, ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

చట్టాలపై అవగాహన అవసరం



పెరుమాళ్లపల్లిలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ హైమావతి

తిరుపతి రూరల్: గ్రామ స్థాయి నుంచే మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, అప్పుడే మహిళలపై హింస తగ్గుతుందని శ్రీపద్మావతి మహిళా వర్సిటీ అధ్యయన కేంద్రం అసోసియేట్ ప్రొఫెసర్ హైమావతి పేర్కొన్నారు. శనివారం తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్లపల్లిలో పొదుపు సంఘాల మహిళలకు 'మహిళలపై హింస – చట్టాలు, సమాజం పాత్ర' అనే అంశంపై మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. మహిళలపై హింసను అరికట్టడంలో కుటుంబం, సముదాయం, గ్రామ సంఘాలు, సచివాలయ సిబ్బంది ముఖ్యపాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.

బాబు జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళి

తిరుపతి తుడా: తొలి ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతిని శనివారం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ అదితి సింగ్ బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించారు. అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, ఉప కమిషనర్ అమరయ్య, ఎస్ఈ మోహన్, ఎంఈలు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ పాల్గొన్నారు.

నా పాలనపై విచారణ జరిపించండి

'చంద్రగిరి నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశా.. ప్రతి కుటుంబాన్ని నా సొంత కుటుంబ సభ్యులుగా భావించి సంక్షేమంతో పాటు స్వచ్ఛందంగా సేవ చేశా. ఆ విషయం ప్రజలందరికీ తెలుసు. గెలిచిన వాళ్లు ప్రజలకు మంచి చేయడం, నియోజవర్గాన్ని అభివృద్ధి చేయడంపై దృష్టి సారించాలి. కొంతమంది నాపై నిరాధార ఆరోపణలు చేయడం నన్ను బాధించింది. అందుకే తుడా చైర్మన్‌గా పనిచేసిన కాలంలో నేను చేసిన అభివృద్ధిపై సమగ్ర విచారణ జరిపించండి' అంటూ చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, అలాగే డెప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ మంత్రులు నారాలోకేష్, నారాయణకు స్వయంగా ఉత్తరం రాశారు.

- సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులు లోకేష్, నారాయణకు ఉత్తరం రాసిన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



తిరుపతి తుడా: 'తుడా స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థ. ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు రావు. ఆర్థిక వనరులను సమకూర్చుకొని అభివృద్ధి తోపాటు ఉద్యోగులకు జీతాలు, పింఛన్లు ఇవ్వాల్సి ఉంటుంది. తుడా ఆదాయంలో ప్రతి ఏటా కొంత డబ్బు ఉద్యోగుల జీతభత్యాల కోసం కొంత నిధిని ఫిక్స్‌డ్ చేయాల్సి ఉంటుంది. అయితే అంతకుముందు పదేళ్లు ఒక్క రూపాయి కూడా డిపాజిట్ చేయలేని స్థితిలో తుడా ఉండేది. ఈ పరిస్థితుల్లో 2019లో తుడా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టాక స్వయం ఆర్థిక ప్రతిపత్తి కలిగిన తుడాను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు శక్తి మేర పనిచేశాను. తుడా పరిధిని 9 నియోజకవర్గాలకు, రాయలసీమకు జీవనాడి అయిన శ్రీసిటీని సైతం ఈ తుడా పరిధిలోకి తీసుకొచ్చేందుకు శక్తి వంచన లేకుండా పనిచేశాను. తుడాకు బ్యాంకును సమకూర్చి తద్వారా లే అవుట్లను వేయించి మధ్యతరగతి కుటుంబాలకు ప్లాట్లు విక్రయించి తుడాకు ఆర్థిక వనరులను సమకూర్చాను. తుడాకు చెందిన ఆక్రమిత భూములను స్వాధీనం చేయించుకుని ఖాళీ స్థలాల్లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి ప్రతినెలా బాడుగల రూపంలో ఆదాయం వచ్చేందుకు నిస్వార్థంగా పనిచేశాను. నియోజకవర్గాల్లో పచ్చదనాన్ని పెంపొందించేందుకు నర్సరీలను అభివృద్ధి చేశాను. తద్వారా కూడా ఆదాయ వనరులు సమకూర్చాను. ఉద్యోగస్తుల భద్రతకు పెద్దపీట వేసి ఫిక్స్‌డ్ డిపాజిట్లు వేయించగలిగాను. గతంలో మంత్రిగా నారా లోకేష్ పనిచేసిన కాలంలో ఆయన మంత్రిత్వశాఖలో ఫైబర్ గ్రిడ్ సీఈఓగా పనిచేసిన ఎస్ హరికృష్ణను తుడా ఈజీగా పోస్టింగ్ వేయించుకున్నాను. అలాంటి నిబద్ధత కలిగిన అధికారులతోనే తుడాలో పనిచేయించాను. ఉద్యోగుల పింఛను నిధికి రూ.15 కోట్లు డిపాజిట్ చేయించాను. నేను చేసే ప్రతి పని ద్వారా తుడా గౌరవాన్ని పెంచానే తప్ప ఎక్కడా తప్పు చేయలేదు. పల్లెల్లో సీసీ రోడ్లు, డ్రైయిన్లు, కమ్యూనిటీ భవనాల నిర్మాణం, పచ్చదనం పెంపే లక్ష్యంగా చట్టబద్ధంగా అభివృద్ధిని పరుగులు పెట్టించాను. ఈ అభివృద్ధి పనులన్నీ అన్ని అనుమతులతో నిబంధనల మేరకు చేయించాం.

ఆక్రమణల నుంచి తుమ్మలగుంట చెరువుకు రక్ష

'తుమ్మలగుంట చెరువు రోజు రోజుకూ ఆక్రమణలకు గురవుతుండడంతో ప్రస్తుతం సీఎం ముఖ్య కార్యదర్శిగా పనిచేస్తున్న నాటి చిత్తూరు జిల్లా కలెక్టర్ రవిచంద్ర ఆక్రమణలపై ఉక్కు పాదం మోపారు. భవిష్యత్‌లో ఆక్రమణలకు గురికాకుండా చెరువును కాపాడాలంటే తుడాకు అప్పగించడమే ఏకైక మార్గమని నాడు తుమ్మలకుంట చెరువును తుడాకు అప్పగించారు. ఆక్రమణదారులు సుప్రీంకోర్టుకు వెళితే మేమంతా కోర్టుకు వెళ్లి పోరాటం చేసి తద్వారా ఆ స్థలాన్ని కాపాడుకోగలిగాం. తుమ్మలగుంట చెరువు కట్టను 16 అడుగుల ఎత్తుకు పెంచి పటిష్టం చేశా. చెరువు కట్ట చుట్టూ 25 అడుగుల లోతులో కందకాన్ని తవ్వి నీటి నిల్వకు చర్యలు తీసుకున్నాం. ఈ క్రమంలో కోర్టు ఉత్తర్వులకు లోబడి శాశ్వత కట్టడాలకు తావులేకుండా క్రీడా మైదానంగా తుమ్మలగుంట చెరువును అభివృద్ధి చేశాం. 16 రకాల క్రీడా మైదానాలు, చెరువు చుట్టూ 52 రకాల పూల చెట్లు 43 రకాల పండ్ల చెట్లు మొత్తంగా 16 లక్షల మొక్కలను నాటి తుడా పరిరక్షిస్తోంది. దేశంలో ఎక్కడా లేని టెక్నాలజీతో రెండు కిలోమీటర్ల మేర వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశాం. క్రీడాకారుల కోసం తాత్కాలిక షెడ్లు టాయిలెట్లు నిర్మించాం. 70 ఎకరాల విస్తీర్ణంలో ఆధునిక టెక్నాలజీతో శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి స్పోర్ట్స్ పార్క్ ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చాం. స్పోర్ట్స్ పార్క్ సంరక్షణకు, భవిష్యత్‌లో మెయింటెనెన్స్ కోసం ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించాను. తద్వారా వచ్చే వడ్డీ డబ్బుతో మాత్రమే ఈ పార్కును మెయింటైన్ చేసేలా ఆలోచన చేసి ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించాను. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు సేద తీరేందుకు మోడరన్ సిమెంట్ బెంచీలను వేయించాను. నాడు గోదావరి పుష్కరాల్లో ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచ్‌లను ఆదర్శంగా తీసుకొని ప్రభుత్వం నిర్ణయించిన ధరను దృష్టిలో ఉంచుకొని టెండర్ల ద్వారా తుడా పరిధిలో సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేయించాం. తుడా పాలకమండలి ఆమోదంతోపాటు అన్ని రాజకీయ పార్టీలతో సమావేశమై చర్చించి ప్రజలకు అవసరమైన అభివృద్ధి ఫలాలను అందించేందుకు అనునిత్యం ప్రయత్నం చేశాను. నా పాలనలో గొప్పగా పనిచేశానని, నిస్వార్థంగా అభివృద్ధి చేశానన్న పేరు తెచ్చుకునేందుకు, ప్రజల్లో, సమాజంలో నాకంటూ ఉన్న ప్రత్యేక గౌరవ మర్యాదలను మరింత బలోపేతం చేసుకునేందుకు నేను అనునిత్యం ప్రయత్నం చేశాను. అందుకే నేను అత్యున్నత స్థాయిలో అభివృద్ధిని పరుగులు పెట్టించాను. నేను భక్తి.. భయం కలిగినవాణ్ణి, ఏ తప్పూ చేయను. నా పరిధిలో ఎవరినీ తప్పులు చేయనివ్వను. అందుకే నా పాలనపై తుడాలో జరిగిన అభివృద్ధిపై తమరికి ఎలాంటి అనుమానం ఉన్నా, అవసరం అనుకున్నా నిష్పక్షపాతమైన సమగ్ర విచారణ జరిపించండి' అంటూ తుడా మాజీ చైర్మన్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తాను రాసిన లేఖలో పేర్కొన్నారు.

యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి



విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేస్తున్న కళాశాల అధినేత సి.గంగిరెడ్డి

తిరుపతి సిటీ: పారిశ్రామిక రంగంలో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని, యువత అవకాశాలను సద్వినియోగం చేసుకుని లక్ష్యాలను చేరుకోవాలని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కరకంబాడి రోడ్డులోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల రెండో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆధునిక సమాజంలో పోటీతత్వాన్ని ఎదుర్కొనే సామర్థ్యంతో స్కిల్స్‌ను పెంపొందించుకోవాలని సూచించారు. కళాశాల అధినేత డాక్టర్ సి.గంగిరెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో ఏ దేశంలోనైనా చదువుకున్న వ్యక్తికి ప్రత్యేక గౌరవం ఇస్తారన్నారు. తమ కళాశాల విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగ కల్పనే లక్ష్యంగా కృషి చేస్తోందన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ సి.నాధమునిరెడ్డి కళాశాల వార్షిక విద్యా నివేదికను సభకు వివరించారు. అనంతరం ముఖ్యఅతిథుల చేతుల మీదుగా బీటెక్ పూర్తి చేసుకున్న 503 మంది విద్యార్థులకు, 60 మంది పీజీ విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఐసర్ రిజిస్ట్రార్ విజయ్ మోహన్ పిళ్లై, డీన్ వి.వేణుగోపాల్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లిటిల్ ఏంజెల్స్‌లో స్కూల్ కేబినెట్



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏసీబీ అడిషనల్ సూపరింటెండెంట్ వై.జెస్సీ ప్రశాంతి, రమాదేవి

తిరుపతి కల్చరల్: యశోదనగర్‌లోని లిటిల్ ఏంజెల్స్ పాఠశాలలో శనివారం నూతన కేబినెట్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి లిటిల్ ఏంజెల్స్ పూర్వ విద్యార్థి, ఏసీబీ అడిషనల్ సూపరింటెండెంట్ వై.జెస్సీ ప్రశాంతి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. తనతో పాటు చదివిన విద్యార్థులు చాలా మంది ఉన్నత పదవులలో ఉండడం గర్వకారణమని, దీని వెనుక లిటిల్ ఏంజెల్స్ అధినేతలు రాజగోపాల్‌రెడ్డి, రమాదేవి కృషి ఎనలేనిదన్నారు. అనంతరం ఆమె ఎంపికైన విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. డైరెక్టర్ శ్వేతారెడ్డి మాట్లాడుతూ కెప్టెన్, వైస్ కెప్టెన్ అపెక్స్ బాడీల ఎన్నిక ముఖ్యం కాదని, సవాళ్లను ఎదుర్కొని సమర్థవంతంగా పని చేసినప్పుడే తగిన ఫలితాలను పొందుతామని తెలిపారు. స్కూల్ అధినేత రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ లిటిల్ ఏంజెల్స్ విద్యార్థులు అన్ని కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ పద్మశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు టీకాలు తప్పనిసరి



కుక్కలకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారులు

పాకాల: పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా రేబిస్ టీకాలు వేయించాలని దామలచెరువు పశు వైద్యాధికారి డాక్టర్ జానకమ్మ తెలిపారు. శనివారం ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా దామలచెరువు, మొగరాల పంచాయతీల్లో పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా రేబిస్ వ్యాధి రాకుండా టీకాలు వేయించే రోజునే ప్రపంచ జునోసిస్ దినోత్సవంగా జరుపుతామని తెలిపారు. మొగరాల పశువైద్యాధికారి డాక్టర్ పవన్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.